# విపర్యయాలు

నవ వధువుగా కుడిపాదం యెత్తి గుమ్మంలో కాలు పెట్టిన వసంత ఎదురుగా గోడమీద శాంత లైఫ్ సైజు బస్ట్ ఫోటో చూసి ఆశ్చర్యంతో తెల్లబోయింది.

శాంత! శాంతేనా! మళ్ళీ నిశితంగా చూసింది.

శాంతే! వదువుగా నిండు అలంకరణతో ఉండటంమూలాన త్వరగా గుర్తుపట్టలేక పోయింది.

శాంత వదలి వెళ్ళిన స్థానాన్ని తను పొందింది!?

అయోమయంగా, నివ్వెరపాటుతో చూస్తున్న వసంత, అందరూ తనవంకే చూడడం గమనించి తలవించుకుంది.

చుట్టూ అందరి మొగాలు దుఃఖంతో మ్లాన మయ్యాయి. వసంత భర్త శివరాం మొదటి భార్య గుర్తువచ్చి కాబోలు, నల్లబడిన మొహంతో తల త్రిప్పుకుని గిరుక్కున తిరిగి గదిలోకి వెళ్ళిపోయాడు. మామగారు దీర్ఘంగా నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయారు. అత్తగారు కోడలిని తలుచుకుని కళ్ళొత్తుకుంది. మరదులు, ఆడబడుచులు వసంత మొగంలోకి చూసి తలలు దించుకున్నారు.

అందరి మధ్య, ఏం చేయాలో తోచని స్థితిలో క్రొత్తగా, బిడియంగా నలువైపులా చూసి తల దించుకుంది వసంత. తనేదో తప్పు చేసినట్లు అనిపించింది వసంతకి. అందరి ఆ స్థితికి కారణం తనే అన్నట్టు సిగ్గుతో కృంగిపోతున్న వసంతని.... వసంత అక్కయ్య కమల చెయ్యి పట్టుకు గదిలోకి నడిపించుకు వెళ్ళింది.

ఏమిటిది? క్రొత్తగా గుమ్మంలో కాలుమోపిన పెళ్ళి కూతుర్ని యిదేనా ఆహ్వానించే విధానం? ఎంత రెండో పెళ్ళి అయినా కాస్త ఆదరణ, సంతోషం లేకపోగా ఈ ఏడుపులేమిటి? తనేదో నేరం చేసినట్లు చూస్తారేమిటి అందరూ? వసంత హృదయం అవమానంతో కృంగిపోయింది. అసలు పెళ్ళయినా అదోలా జరిగింది। ఏ ముద్దు ముచ్చట లేని పెళ్ళి। గుళ్ళో దేముడి ఎదుట పుస్తెకట్టి, వెంటనే యిక్కడికి తీసుకువచ్చారు। యింతే తనకి రాసిపెట్టిఉంది.... వసంత కుమల సాగింది ఆలోచించిన కొద్దీ.

వసంత మనోభావాలు పసిగట్టి కమల వోదార్పుగా అంది "బాధపడకమ్మ, వసూ। రెండో పెళ్ళి అంటే ఇంతే। మొదటి సారిలాగ ఆడంబరాలు రాలు అవీ వుండవు। ఎలాగో సర్దుకోవాలి। మనం అనుకుని లాభంలేదు.। నాలుగు రోజులు పోతే వాళ్ళే సర్దుకుంటారు"

వసంత దిగులుగా కళ్ళు తుడుచుకుంది.

వంటావిడ కాఫీ తెచ్చియిచ్చి వసంత మొహంలోకి గుచ్చి గుచ్చి చూసింది. అన్ని కోణాలనించి పరిశీలించి చూసింది. "ప్చ ... శాంతమ్మ ... మహాతల్లి.... శాంతమ్మ పోయాక ఈ యింటి కళే పోయింది చినబాబు మొగంలో ఆనాటినించి నవ్వేలేదు.... మళ్ళీ ఎప్పటికి నూకతాడో చినబాబు" ముసలిది కళ్ళుతుడుచుకుంటూ అంది.

ఎవరెవరో, ఒక్కొక్కళ్ళు, పనివాళ్ళు సయితం గదిలోకి తొంగి

చూస్తున్నారు కుతూహలంగా. ఆ చూపులు తూట్లలా గుచ్చుకోసాగాయి వసంతకి.

బాత్‌రూములోకి బట్టలు పట్టుకు స్నానానికి వెడుతున్న వసంతకి నూతిదగ్గర పనివాళ్ళమాటలు వినిపించాయి. "శాంతమ్మగోరు మాలచ్చిలా గుండేవారు యింట్లో.... కూసంత చాయ తక్కువ అయినా ఆ యమ్మ కళ ఈ యమ్మ కెక్కడుంది! ఎత దొడ్డ మనసా అమ్మది.... శాంతమ్మగోరంటే పెదబాబుగారి కాడనించి ఎంతగురి! ఆ యమ్మ చేతిమీదనే అన్ని జరగాలి! అందరి తల్లో నాలికలా మెలిగేది ఆ యమ్మ, ఎవరిని ఎట్లా చూసుకోవాలో అట్టా చూసేది .... యింకా ఈ కొత్త కోడలమ్మ యెలా గుంటుందో"!....

స్నానం చేస్తున్నంతసేపూ వసంత కళ్ళలో నీరు తిరుగుతూనేవుంది. ఛ .. బొత్తిగా యింత అనాదరణా! ఇంత అనాదరణ, అవమానం జరుగుతుందని తెలిస్తే తను చచ్చినా ఈ పెళ్ళి చేసుకోక పోయుండును! పెళ్ళి కాక వుండినాసరే, యింతకీ యింకోరిని అనడం ఎందుకు!? తన అదృష్టం యిలా వుంది!

ఎంత బ్రతుకు బ్రతికింది, తన అందం, చదువు అన్ని, యీ శాంత ముందు పనికిరాకుండా పోయాయి, తన శాంతతోనా పోల్చి వీళ్ళు హీనం చేస్తున్నారు, యింకెవరితోనైనా అయితే తనింత బాధకపడకపోను. ఎక్కడ తను? ఎక్కడ శాంత! కాని యిప్పుడు వీళ్ళందరి దృష్టిలో ఎక్కడ శాంత? ఎక్కడ తను.

పరిస్థితులు యిలా మారిపోతాయని ఎప్పుడైనా అనుకుందా? తన తండ్రే బ్రతకుంటే! యిలా జరిగేదా? ఎంత దర్జాగా పెరిగింది. చిన్నప్పటి

నించి, ఏది కావాలంటే అది వెంటనే నిమిషాలమీద అమర్చే తండ్రి ఎంత అపురూపంగా పెంచారు! అన్నింటిలోనూ తన పంతమే చెల్లేది. పెద్ద ఉద్యోగంలో ఉండే తండ్రి, ధనం, హోదా, అందం, చదువు అన్నీ కలిసి చిన్నప్పటినించి తనలో అహంకారం పెంచాయి. ఏమయిపోయింది ఆ అహంకారం అంతా! తండ్రితోనే పోయాయి అన్నీ. ఉద్యోగం చేస్తున్నంతకాలం హోదాలకి, దర్జాలకి, పిల్లల ముద్దు ముచ్చట్లకి విచ్చలవిడిగా ఖర్చుపెట్టి దమ్మిడి వెనకేయకుండా, హఠాత్తుగా కుటుంబాన్ని నడి సముద్రంలో వదిలి కన్నుమూస్తే, ప్రావిడెంట్ ఫండు తప్ప ఏ ఆధారం లేని తల్లి, మేనమామ యింటికి చేరింది తమందరితోటి. మేనమామ సహాయంతో, పెళ్ళికెదిగి కూర్చున్న కూతుర్లనిద్దరినీ ఒక యింటి వాళ్ళని చేయడానికి నానా తంటాలుపడి అక్కయ్యని అతి ప్రయత్నము మీద ఒక యింటి దాన్ని చేయ గలిగింది. తరువాత తన వివాహానికి ఎన్నో పాట్లుపడి, పాతికేళ్ళు వచ్చిన తనకి ఆఖరికి యీ సంబంధం కుదిర్చింది రెండో వివాహం అయినా, వయసు ముప్పైకి మించలేదని, ఉద్యోగస్థుడు, ఆస్తిపరుడు అని నిశ్చయించారు. ఒక్క రెండో పెళ్ళి అన్నలోటు తప్ప యింకేలోటు లేదని తనూ ఒప్పుకుంది! కాని యిలా తనని యింత అనాదరణ చేస్తారని, తన అందం అంతా యిలా శాంతతో పోల్చి, హీనం చేస్తారని తెలుసుంటే అసలు ఈ సంబంధం శాంత భర్త అని తెలుసుంటే... !?

శాంత తనకి తెలుసని వీళ్ళకి తెలిస్తే వీళ్ళ గొప్ప కబుర్లు యీ పొగడ్తలు అన్నీ ఏమవుతాయో! ...

♦ ♦ ♦ ♦

ఆ రాత్రి మొదటి రాత్రి దడదడలాడే హృదయంతో, తడబడే అడుగుల్తో గదిలోకి అడుగుపెట్టిన వసంతకి మంచంమీద తలక్రింద రెండు

చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని తదేకంగా ఎదురుగా గోడమీద శాంత ఫొటో చూస్తున్న భర్తని చూడగానే మనసు కలుక్కు మంది. సిగ్గు, సంకోచాలతో ఎంతసేపు అలా నిలబడ్డా, ఆమె ఉనికే పట్టకుండా, ఏ ఆత్రుతా, ఏ ఉత్సుకతా లేకుండా నిస్తేజంగా, తదేకంగా అలా ఆలోచిస్తూ పడుకున్న శివరాంని చూస్తుంటే వసంత హృదయం కోపంతో, అవమానంతో మండింది.

అతని దృష్టిని మరల్చడానికి చిన్నగా దగ్గింది. గాజులు చప్పుడు చేసినా కూడ తన రాకనే గుర్తించనంత పరధ్యానానికి వసంత వళ్ళు దహించింది. ఎంత నిర్లక్ష్యం! ఎంత నిరాదరణ! అంత యిష్టంలేనపుడు, అంత ఆ భార్యని మరవలేని మనిషి మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకోవాలి, తన గొంతు ఎందుకు కోయాలి!

ఏదో ఆవేశంతో చరచర మంచం దగ్గరికి వెళ్ళింది, ఏం అనాలో తోచని స్థితిలో. శివరాం శాంత ఫోటోనించి చూపు మరల్చి వసంతవైపు ఏ భావమూ వ్యక్తంకాని ఒక్క చూపు చూశాడు. ఒకసారి వసంతవైపు, ఇంకోసారి శాంత ఫోటో వైపు మార్చి మార్చి చూశాడు. మనసుకి నచ్చ చెప్పుకుంటున్నట్టు ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు. భర్త మొహం లోని హావ భావాలు పరికిస్తున్న వసంత మొహం ఎర్రబడ సాగింది.

ఆఖరికి కళ్ళు తెరచి తనవైపే చూస్తున్న వసంతని "కూర్చో వసంతా, అలా నిలబడ్డావేం?" అన్నాడు శివరాం. అప్పటికయినా తనని గుర్తుకు తెచ్చుకున్నందుకు సంతోషిస్తూ ఒక వారగా కూర్చుంది వసంత సిగ్గుతో.

నెమ్మదిగా నిట్టూర్చి, శాంత ఫొటో చూపిస్తూ "ఆ ఫొటో ఎవరిదో తెలుసుగా?" అడిగాడు శివరాం.

మౌనంగా తలూపింది వసంత.

"శాంత!....శాంతకి అపుడే మూరేళ్లు నిండి నన్నొదిలి వెళ్లిపో

యింది శాంత లేనిలోటు తీర్చగలవని నమ్ముతున్నాను వసంతా! శాంత! నిజంగా పేరుకి తగ్గట్టే వుండేది! అందరి కోరికవల్ల నిన్ను పెళ్ళి చేసుకున్నాను, శాంతలేని లోటు నీవు భర్తీ చేయాలి వసంతా, .. నా నమ్మిక, నా ఆశలు నిలబెడ్తావు గదూ వసంతా!" తడి అయిన కళ్ళతో చెపుతున్న భర్తని చూసి ఒక్క క్షణం వసంత మనసు ఆర్ద్రమయింది కాని ఇక్కడా శాంతేనా? ఇక్కడా, ఇప్పుడూ శాంత పొగడ్తేనా? అనుక్షణం శాంత! శాంత స్మరణే, యింక తన ఉనికి గుర్తించే దెప్పుడు? మొదటి రోజునే యిలా వుంటే? వసంత మొహంలో భావాలు అర్థంచేసికొన్నట్టు శివరాం యింకేం మాటలు పెంచకుండా దగ్గిరకి తీసుకున్నాడు వసంతని.

*　　　*　　　*

వసంత వచ్చి రెండు నెలలయింది. ఆ రెండు నెలలలోనూ ఆ యింటిలో అందరికి శాంత అంటే ఎంత ప్రేమాభిమానాలో, ఎంతటి గురో స్వయంగా తెలుసుకుంది? పనివాళ్ళ ద్వారా, యింటిలో వాళ్ళ మాటలు బట్టి అనేక విషయాలు గ్రహించింది. మామగారు, అత్తగారు, ఆడపడుచులు, మరదులు అంతా ఏదో విధంగా ఎప్పుడో ఒకప్పుడు రోజులో ఒక్కసారైనా తలుచుకోకుండా వుండరు శాంతని.

ఉదయం లేచి కాఫీ, టిఫిన్లనించి, వంట పురమాయింపులు, ఒక్కొక్క టైముకి వచ్చే భర్త, మామగారు, మరుదులు, ఆడపడుచులు భోజనాలు దగ్గిరుండి చూడడం, ఎవరి గదుల్లో వారికి బట్టలుసర్ది, ప్రక్కలు సర్ది, పుస్తకాలుసర్ది, ఎవరి బట్టలు మాస్తాయో చూసి, ఎవరి బటన్సు వూడాయో చూసి కుట్టడం, వేళ వేళకి స్కూళ్ళకి, కాలేజీలకి, ఆఫీసులకి దగ్గిరుండి అన్నీ చూసి పంపడం, పనివాళ్ళని సమర్థించుకోవడం అన్నీ స్వయంగా చూసేదిట శాంత! ఎవరికయినా అనారోగ్యం చేస్తే కన్నతల్లి కంటే ఎక్కువగా రాత్రింబగళ్ళు దగ్గిరుండి సేవచేసేదిట. ఉదయం లేచింది మొదలు అందరి అన్ని అవసరాలు చూస్తూ వూపిరి సలపని పనిలో మునిగి

వున్నా, ఏనాడు ఆమె మొహాన్న విసుగుగాని, అలసటగాని కనిపించక చిరునవ్వుతో కలకలలాడేదిట.

ప్రొద్దున్నే లేచింది మొదలు 'అమ్మా, శాంతా కాఫీ అయిందా?' అన్న మామగారి ప్రశ్న వోవంక, 'పూలు కోశావామ్మా శాంతా' దేముడి గదిలోంచి అత్తగారికేక వో ప్రక్క, 'నా టూత్ బ్రష్ యేది వదినా, కనపడ్డంలేదు' అన్న చిన్నమరిది కేకలు. 'చూడు వదినా, స్నానానికి నీళ్ళు తోడడంలేదు రాముడు' అంటూ చిన్న ఆడపడుచు ఫిర్యాదు, 'వదినా, నాలుగింటికి లేపుతానని లేపలేదేం!' కాలేజి చదువు చదివే ఆడబడుచు అభియోగం. 'ఏమండోయ్ వదినగారు, దంత ధావనం అయింది, ఇప్పుడయినా కాస్త కాఫీ పోస్తారా?' చదువు పూర్తయి, ఉద్యోగాన్వేషణలో ఉన్న మరిది బెడ్ కాఫీ యివ్వడంలేదని చేసే నిష్ఠూరం, 'అందరికీ అన్నీ అమర్చాక గాని నేను జ్ఞాపకం రానుగాబోలు' ఎనిమిది గంటలకి నిద్రలేచే భర్తగారి అలక, వో ప్రక్క పాలవాడు, ఇంకో ప్రక్క కూరలమనిషి కేకలు, పనిమనిషి పిలుపులు, వంట చెప్పమంటూ వంటావిడ సణుగుడు, అన్నీ చక్కబెడ్తూ, మళ్ళీ పదకొండు గంటలకల్లా కాలేజీలకి; ఆఫీసులకి క్యారీయర్లు సర్ది పంపడం, మళ్లీ సాయంత్రం నాలుగింటికి కాఫీ ఫలహారాలు సిద్ధం చేయడం రాత్రి వంట పురమాయింపులు, కాసేపు చిన్న ఆడపడుచు, మరిదిచేత చదివించడం, రాత్రి భోజనాలు. ఇలాంటి విధి విరామంలేని నిత్యకృత్యాలు నేర్పుతో సమర్థించుకుంటూ బాధ్యతతో నిర్వహించి, అందరి అభిమానానికి పాత్రురాలయిన శాంత ప్రతిపనికీ, ప్రతిక్షణం అందరి హృదయాలలో మెదులుతూంది యిప్పటికీ కాపురం చేసిన రెండేళ్ళలో అందరికి యింత ప్రీతిపాత్రురాలైన, అందరిని మెప్పించిన శాంతని; అందరూ మరచి తనని గుర్తించాలంటే ఏం చేయాలి?– వసంతని వేధించే సమస్య అది.

శాంతతో సమాన స్థాయికి తనెప్పటికి చేరుకో గలదు? అసలు చేర గలదా? వసంతలో అలజడి గలిగించే అనుమానం అది. శాంత లేందే ఇది వరకు జరగనిపనులు, ఇప్పుడు శాంతస్థానాన్నే వసంతవున్నా ఆమెఅవసరం లేకుండానే వాటంతట అవే జరిగిపోతున్నాయి! ఉదయం లేచింది మొదలు అందరూ ఎవరి పనులు వారు ఆమె ఉనికే గుర్తించకుండా చేసుకోవడం వసంతకి బాధ అనిపించింది.

ఎదురుగా వున్న మామగారు వసంతని అడగకుండా భార్యనో, కూతురనో కాఫీ అడుగుతారు. అత్తగారు స్వయంగానే పూలు కోసుకుం టుంది. ఇంటి విషయాలు, బజారు పనులు చెప్పడం అన్నీ అత్తగారే స్వయంగా చూసుకుంటుంది. ఆడపడుచులు వాళ్ళంతట వాళ్ళు చనువుగా మాట్లాడరు, వసంత ఏదైనా అడిగితే తప్ప మాట్లాడరు. పెద్ద మరది అసలు వసంత వున్న ఛాయలకే రాడు ఆఖరికి చిన్న మరిదికూడ శాంతచేత నీళ్ళు పోయించుకు, బట్టలు తొడిగించుకునే ఆ మరిదికూడ వసంత పిలి చినా సిగ్గుపడి పారిపోతాడు. ఇలాంటి వాతావరణంలో తనంతట తానుగా ఏం చేయాలో కూడ తోచేదిగాదు వసంతకి. ఎంత సేపటికి ఆమెనొక గెస్టుగా చూస్తున్నారు తప్ప యింటిలో మనిషిగా ఎవరూ గుర్తించకపోవ డం వసంతకి అవమానం అనిపించింది. ఎన్నాళ్లో సహించలేకపోయింది ఆ బాధ. ఒకరోజు శివరాంతో మనసులో బాధ వెళ్ళగ్రక్కింది.

"బావుంది, నీ అంతట నీవు కల్పించుకుని చేయాలిగాని, క్రొత్తగా వచ్చిన దానివి, నీతో ఏం చెపుతారు, ఎవరుమాత్రం?" అన్నాడు భర్త కూడ వాళ్ళనే సమర్థించడంతో కోపం ముంచుకు వచ్చింది వసంతకి.

"ఏం చేస్తాను. నా అంతటనేను. నన్నందరూ వెలేసినట్లు దూరంగా వుంచి, మాట్లాడనైన మాట్లాడకపోతే, ఏం చేయాలో నా కేం తెలు స్తుంది?"

శాంత చెప్తేనే చేసేదా? వచ్చిన నెలరోజులకే యింటి బాధ్యతఅంతా చేతిలోకి తీసుకుంది!" ....యింకేం మాట్లాడుకుంది వసంత....ఎంత గురి, శాంతంటే:

మర్నాడు వసంత తనంత తానుగా చొరవగా ముందుగాలేచి కాఫీ కలిపి మామగారికి తీసికెళ్ళి యిచ్చింది, ఆయన ఒకసారి కళ్ళెత్తి వసంత వైపుచూసి. మౌనంగా గ్లాసు అందుకున్నారు ఆ వెంటనే అత్తగారునిపిలిచి ఏదో చెప్పారు. ఆవిడ కాఫీగ్లాసు వెనక్కితెచ్చి "మీ మామగారికి అంత స్ట్రాంగ్ కాఫీ పడదు, పంచదార కూడ అంత వేసుకోరు, నీకు తెలీదు, నేను కలిపిస్తాలే' అంది. వసంతకి తల కొట్టేసి నట్లయింది. ఎంతో శ్రద్ధగా మెప్పుకోసం స్ట్రాంగు కాఫీ తీసికెళ్ళి యిస్తే యిలా అయిందేంటి!....

మళ్ళీ వెంటనే దులిపేసుకుని, లేచి ఉత్సాహం తెచ్చుకుని పూల సజ్జ పట్టుకుని పూలుకోసి తీసుకొచ్చింది. కోసి తెచ్చిన పూలు చూసి అత్తగారు. "అయ్యో స్నానం చేయకుండానే పూలన్నీ కోసేసావా?" అదోలా నిష్ఠూరంగా అంది ఆవిడ. శాంత అందరికంటె ముందుగాలేచి స్నానంచేసే మిగతా పనులు చేసేదన్న విషయం గుర్తు కొచ్చింది వసంతకి. ఆ పూట పూజ లేకుండానే అత్తగారు పూజ చేసు కుంటూంటే సిగ్గుతో చితికిపోయింది వసంత, 'అయినా పూలకి కూడ మడేమిటి, మరీను' మనసులోనే కోపంగా అనుకుంది వసంత. నీళ్ళుపోసు కుంటున్న చిన్నమరిది దగ్గరికి వెళ్ళి 'నేను వీపు రుద్దనా వాసూ' అంటూ చనువుగా అడిగితే, వాసు సిగ్గుతో మెలికలు తిరిగి, నీళ్ళు పోసుకోకుండానే లోపలికి పరిగెత్తి వెళ్ళిపోయాడు. వసంత వస్తున్న నిట్టూర్పు అణుచుకుంది.

జడ విప్పుకుంటూ అక్కగారిని జడవేయమని అడుగుతున్న చిన్న ఆడబడుచుని జడవేస్తానంటూ పిలిస్తే, ఆ పిల్ల మొహమాటపడి వద్దు వద్దు

అంటున్నా బలవంతంగా వేసింది వసంత...."అక్కయ్యా, జడ కొంచెం వేయవూ, ఆవిడ ఆ క్రొత్త వదిన, చూడు ప్రక్కపాపిటి తీసి నా మొహమే మార్చేసింది, కదూ, మళ్ళీ వేయవూ" అంటూ నెమ్మదిగా చెప్పి అక్కగారిచేత మళ్ళీ జడవేయించుకున్న ఆ పిల్లని చూడగానే వసంత మనసు అవమానంతో దహించుకుపోయింది.

ఏమిటి వీళ్ళ ఉద్దేశ్యం?—ఆ శాంతపాటి పనులు తనకి చేతకావనా? ఆ శాంతపాటి తెలివితేటలు తనకి లేవనా? ఎంత తనంతట తానుగా కల్పించుకుని ఏ పని చేయబోయినా 'నీకు తెలియదులే నీకు ఎందుకులే?' 'నేను చేసుకుంటానులే' 'వద్దులే అనడంతప్ప, తనని ఏ పని చేయనీయకుండా ఏమి చెప్పకుండా, పరాయిదానిలా, వెలేసినట్లు చూడడం వసంతకి భరించ శక్యంకాని బాధగా తయారయింది.

"ఏంచేసి శాంత అందరి మనసులని యింతగా బంధించింది? ఏం చేసి అందర్నీ ఆ కట్టుకుంది? ఏం చేసి యింత అభిమాన పాత్రురాలైంది. తనలో లేనిది శాంతలో ఏముంది? తనకంటె శాంత ఎందులో ఎక్కువ? శాంతలో వున్నది తనలో ఏంలేదు? శాంతా!? శాంతా, ఎందుకు నన్నిలా చిత్రహింస పెట్టిస్తున్నావు? ఎందుకు నన్నిలా అవమానింప చేస్తున్నావు? ఎందుకు నన్నిలా అందరికి దూరం చేస్తున్నావు? నేను నీ కేంచేశాను, నన్నెందుకు ఇలా దుఃఖపెడుతున్నావు?"

—ఆ రోజు జ్వరంతో వున్న వసంతకి 'తను ఎవరికీ అక్కర లేదు, తనని అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారు, తనెన్నటికీ శాంత స్థానాన్ని పొందలేదు' అన్న భావం ఆమెని నిలువునా కాల్చసాగింది. ఆవేశంతో, కోపంతో, ఆ పరిణామాలకి కారణభూతురాలైన శాంతని, చచ్చి కూడా సాధిస్తూన్న శాంతని మనసులోనే శపించుకోసాగింది వసంత. ఆ ఆవేశపు క్షణాలలోనె చటుక్కున గుర్తువచ్చింది వసంతకి.

శాంత సాధిస్తోంది! చిన్ననాడు చేసిన తన దోషాలకి శిక్షిస్తోంది! తన ఆ నాటి నిర్దయతకి, క్రూరత్వానికి, తన అహంకారానికి శిక్ష వేసింది. శాంత! అవును, అంతే,.... అంతే కావాలి తనకి శాంతవేసిన యీ శిక్ష సరి అయినదే! సౌమ్యురాలు సహృదయురాలైన శాంతని కావాలని హింసించిన, దుఃఖపెట్టిన పాపం వూరికే పోతుందా? అందుకే యిప్పు డనుభవిస్తూంది!-

శాంతని మొదసాటి ఘస్టుఘారంలో అడుగుపెట్టి చూసిన వసంతకి మొదటి చూపుతోనే శాంత అంటే చుల్కన భావం, నిర్లక్ష్యం ఏర్పడింది. నల్లగా, పొట్టిగా, పీలగా, వెలిసిన పరికిణి, నలిగిన జాకెట్టు. జిడ్డోడుతున్న మొహం గట్టిగా ఊబుముక్కపెట్టి వేసిన జడతో కనిపించిన శాంతంటే అదోరకం చుల్కన భావం కలిగింది. తెల్లగా, బొద్దుగా, ఖరీదయిన ఫేషన్ బుల్ సిల్కు గౌనుతో, రెండు జడలతో, ఖరీదయిన బూట్సు, సాక్సుతో, క్లాసందరికంటే తనలో ఏదో ఆధిక్యత కనిపించి గర్వపడింది వసంత. తండ్రి పెద్ద ఆఫీసరు. అందం, ధనం, హోదా, తెలివి తేటలు యివన్నీ ఆమెలో మొదటినించి అహంకారానికి తావిచ్చాయి. ఆ అహంకారంతోనే, ఆ గర్వంతోనే వసంత శాంతని హీనంగా చూసింది క్లాసులో మొదటిరోజు. యింకెక్కడా చోటులేక శాంత ప్రక్కన కూర్చున్న వసంతని శాంత ఎంతో ఆసక్తిగా, కుతూహలంగా ఆమెవంకా, ఆమె ఖరీదయిన దుస్తుల వంకా చూస్తూ, చనువుగా పేరు అడిగి, స్నేహం కలుపుకోబోతే, నిర్ల క్ష్యంగా వసంత జవాబివ్వలేదు. అదేం పట్టించుకోకుండానే శాంత ఆ రో జంతా వసంత వెంట తిరుగుతూ ఏవేవో స్కూలు సంగతులు చెపుతూనే వుంది. క్లాసులో ఆలశ్యంగాచేరిన వసంతకి అడగకుండానే, జరిగినపాఠాల నోట్సులు అవీ యిచ్చి, పూసుకు తిరిగుతున్న శాంతని, తన స్నేహం కోసం ప్రాకులాడే శాంతని చూస్తే వసంతకి మరింత నిర్లక్ష్యం పెరిగింది.

ఆ రోజునుంచి ఏదో విధంగా స్నేహం కలుపుకోడానికి వేలగా

ప్రయత్నించి, వెంట తిరిగే శాంతని చూస్తే వసంతకి మరింత ఏడిపించ బుద్ధివేసి, వెంటబడే శాంతని కసిరికొట్టేది. అయినా కూడ నొచ్చుకునేది గాదు, చిన్నపుచ్చుకునేదిగాదు శాంత. వసంతతో మాట్లాడడమే మహా భాగ్యం అన్నట్లు ఉండేది శాంతకి.

వసంత యింటికి నాలుగిళ్ళ అవతల వుండేది శాంత యిల్లు. శాంత తండ్రి ప్లీడరు. పెద్ద సంపాదన లేకపోయినా ఏదో గుట్టుగా సంసారం గడుపుకునే మధ్యతరగతి సంసారులు. ఉదయం స్కూలుకి వెళ్ళేముందు అరగంట ముందుగా శాంత వసంత కోసం యింటికి వచ్చి కాచుకు కూర్చునేది. అది చూడనట్లుగా కావాలని మరింత ఆలశ్యం చేస్తూ, చివరికి శాంతని పిలవకుండానే స్కూలుకి వెళ్ళిపోయే వసంత వెంట పిలుస్తూ పరిగెట్టేది శాంత. మళ్ళీ సాయంత్రం స్కూలు విడిచిన వెంటనే అంతే. పిలిచి వెంట బడ్డ శాంతని వదిలి ముందుగా పరిగెట్టి వెళ్ళిపోయేది వసంత. పాపం శాంత యింటినించి ఏవో ఫలహారాలు చాటుగా పొట్లం కట్టి తెచ్చి ఆప్యాయంగా, వసంతకిస్తే తినాలని వున్నా 'ఛీ, యిలాంటివి మేం తినం' అంటూ విసిరి పారేసేదివసంత. శాంత ఎంతోచిన్నబుచ్చుకునేది. శాంత ఎదురుగా ఏవేవో తెచ్చుకుని తింటూ ఆశగా చూసే శాంతకి యీయకుండా ఏడిపించేది వసంత యింట్లోవున్న జామిచెట్టు ఎక్కి శాంత క్రిందనించి చూస్తుండగా మంచి మంచి కాయలన్నీ కొరికి పారేసేది. ఒకటీయమని జాలిగా బ్రతిమిలాడే శాంతకి, యిస్తాను యిస్తానంటూనే అన్నీ కొరికిపారేసి చెట్టు దిగిపోయేది. యింట్లో గ్రామఫోను రికార్డులు వింటూ శాంత వచ్చి ఆశ్చర్యంగా, ఆశక్తిగా చూస్తూంటే ఆపేసేది. శాంత రికార్డులు వేయమని బ్రతిమిలాడినా వినకుండా.

క్లాసులో మాష్టరు ప్రశ్నలకి శాంత జవాబీయలేకపోతే వసంత హేళనగా నవ్వేది. శాంత చూడకుండా పుస్తకాలు తీసి డ్రాయింగులమీద

లెక్కలమీద యింకు జల్లి, పిచ్చి గీతలు పెట్టి, పేజీలు చింపేసి, శాంత ఏడుస్తూంటే ఏం తెలియనట్లు నవ్వేది. క్లాసు పిల్లలందరూ యించుమించు వసంత పక్షమే. అందరిని కలిసి కట్టుకట్టి శాంతని ఏడిపించడం, శాంతని వెలేసినట్లు ఎవరిని శాంతతో చేరనీయకపోవడం, అందరితో ఏదో శాంతమీద చెపుతూ ఉడికించి ఏడిపించడం అవన్నీ వసంతకి సరదాలు. జాలిగా చూసే శాంత చూపుని చూస్తూంటే వసంతలో ఏదో పిశాచి మనస్తత్వం తొంగిచూసి యింకా యింకా ఏడిపించబుద్ధివేసేది. ఎంతచేసినా, ఎంత ఏడిపించినా ఒక్కనాడూ కోపగించుకోకుండా, ఎంతో సహృదయంతో, నవ్వుతూ మంచిగా వుండడానికే ప్రయత్నించేది శాంత. కోపమనేదే ఎరగదేమో ననిపించేది. పెద్ద అయ్యాక పెద్ద క్లాసులోకి వెళ్ళాక కాస్త అలాంటి అల్లరి, ఏడిపించడం అవీ తగ్గినా శాంతపట్ల చులకన భావం, నిర్లక్ష్యం అలాగే వుండిపోయేయి వసంతకి. శాంతకూడ వసంతని యింకా అలాగే అభిమానించడమూ మానలేదు.

స్కూలు ఫైనలు అయిన ఆ వేసంగిలోనే శాంతకి పెళ్ళి కుదిరింది. శాంత స్వయంగా శుభలేఖ తీసుకొచ్చి, ఎంతో ఆప్యాయంగా ఆహ్వానిస్తే వసంత చూడనైనా చూడకుండా శుభలేఖ నిర్లక్ష్యంగా పడేసింది. పెళ్ళి నాలుగిళ్ళ అవతల అవుతున్నా వసంత పెళ్ళికి వెళ్ళలేదు. 'శాంత నల్లనిదైతేనేం, అదృష్టవంతురాలు, మంచి సంబంధం దొరికింది' అని అందరూ అనుకుంటున్నా వసంత ఏ ఆసక్తి చూపలేదు తెలుసుకోడానికి.

అత్తవారింటికి వెళ్ళేముందు తనేవచ్చి, పెళ్ళికి రానందుకు ఎంతో నొచ్చుకుంటూ అడిగి, వాళ్ళ ఆయనని చూడడానికి రమ్మని పిలిస్తే ముక్తసరిగా తల ఆడించింది వసంత. మనసులో, 'యీ అందగత్తెనే కాక, ఈ అందకత్తె మొగుడి అందంకూడ ప్రత్యేకంగా వెళ్ళి చూడాలి గాబోలు, నిరసనగా, హేళనగా నవ్వుకుంది వసంత. 'వసంతా నన్ను మర్చిపోతావా? గుర్తుంచుకో 'యీ శాంతని?' ఆప్యాయంగా, అభిమానంగా చేయిపుచ్చుకుని శాంత అంటూంటే మౌనంగా తలూపింది, చేయి లాక్కొని ఏమనలేక వసంత.

శాంత అత్త వారింటికి వెళ్ళిపోయింది.

వసంత కాలేజీలో చేరింది. ఇంటర్ చదువుతూండగానే తండ్రిపోవ డం, వసంతా వాళ్లందరూ వాళ్ళ మేనమామగారి వూరు చేరడం అన్ని జరి గేయి. తరువాత పరిస్థితులు మారి, వసంత గర్వం, అహంకారం అన్నీ చచ్చి.. యిలా ఆమె యీ యింట్లో అడుగుపెట్టడం.... మళ్ళీ యిన్నాళ్ళకి శాంత ఉనికి తెలియడం...." - తల్చుకుంటున్న కొద్దీ వసంతకి, తన చిన్న నాటి ప్రవర్తన శాంతపట్ల ఎంత క్రూరంగా వుందో గుర్తువచ్చి మనసు వికలమవసాగింది.

తను అంత కింత యిప్పుడు అనుభవిస్తోంది. శాంత పడిన క్షోభ తనకిప్పుడు అర్థం అవుతూంది. ఎప్పుడో, ఏదోలోకంలో శిక్షఅనుభవించడం ఎందుకు? .... ఇక్కడే .... యిప్పుడే అనుభవిస్తోంది. కావలసిందే తనకి యిలా!....

"శాంతా! ఎప్పటి కక్షో యిలా తీర్చుకుంటున్నావా? అందరి చేత నన్ను వెలేయించి, అందరికి నన్ను దూరంచేసి, అందరిచేత నిర్లక్ష్యం చేయించి... ప్రతీకారం తీర్చుకుంటున్నావా?....

"తప్పు .... తప్పు .... శాంతా, నీ గురించి అలా వూహించడం కూడ తప్పే! కక్ష, కోపం, పగ,....యీ పదాలకే నీలో తావులేదు....

నా నేరానికి భగవంతుడే శిక్షించాడు నన్ను!"

శాంత సహృదయత, మంచితనంతోనే, ఆమె అందరికి అభిమాను రాలై ప్రీతిపాత్రురాలైంది అన్న నిజం వసంత గుర్తించింది.

వసంత అంతరాంతరాలలో మిగిలిపోయిన అహంకారం అంతా ఆమె కన్నీటిలో కడుగుకుపోగా పశ్చాత్తాప హృదయంతో శాంత క్షమని అర్థిం చింది చేతులెత్తి.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక నుంచి గ్రహింపబడినది)